ప్రజాశక్తి

మంగళవారం 3 డిసెంబర్ 2024

5

పార్వతీపురం మన్యం



డిఆర్ఒ హేమలత బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా రెవెన్యూ అధికారిగా కె.హేమలత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభికను మర్యాదపూర్వకంగా కలిశారు. హేమలత గతంలో పార్వతీపురం, పాలకొండ, విజయనగరం ఆర్డిఒగా పనిచేశారు. హేమలత డిఆర్ఒగా నియామకం పట్ల కలెక్టర్ అభినందనలు తెలియజేస్తూ జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.



కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న డిఆర్ఒ హేమలత

ఎన్నాళ్లీ అవుట్ సోర్సింగ్ బతుకులు?

- మేమేం పాపం చేశామంటున్న గురుకుల టీచర్లు
- ఊరటనివ్వని గిరిజనశాఖా మంత్రి వ్యాఖ్యలు
- భగ్గుమంటున్న ప్రజాసంఘాలు, పార్టీలు
- ప్రత్యామ్నాయ పోరాటాలపై యోచన

ప్రజాశక్తి - పార్వతీపురం

ఇంకెన్నాళ్లీ అవుట్ సోర్సింగ్ బతుకులని సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రశ్నిస్తున్నారు. జీవితాంతం చాలీచాలని జీతాలతో ఎలా బతుకుబండి నడిపించాలని రోధిస్తున్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస స్థాయిలో లేని జీతాలతో మరో ఉద్యోగం వైపు చూడకుండా పని చేస్తున్న తమ పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమ్మెబాట పట్టి 15రోజులు దాటుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని తప్పు పడుతున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో నైనా ప్రభుత్వ పెద్దలు తమ సమస్యలకు ఓ పరిష్కారమార్గం చూపుతారేమోనని గంపెడాశతో ఎదురు చూశారు. కానీ వారికి నిరాశే మిగిలింది. ఆందోళన చేస్తున్న గిరిజన సంక్షేమ అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల్లో 80 శాతం మంది గిరిజనులే ఉన్నారు. వీరంతా 15 ఏళ్ల నుంచి 20 ఏళ్లకు పైగా పని చేస్తున్న వారే. గిరిజన గురుకుల పాఠశాలల్లో, కళాశాలల్లో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఉపాధ్యాయులు, అధ్యాపకుల నియామకాలకు తొలుత శ్రీకారం చుట్టింది టిడిపి ప్రభుత్వ హయాంలోనే. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో 1600 మందికి పైగా అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు పని చేస్తున్నారు. వీరిలో 200 మందికి పైగా 50 ఏళ్ల వయసు పైబడిన వారే వున్నారు. గడచిన ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం వీరి సమస్యల పరిష్కారానికి కనీస చర్యలు చేపట్టలేదు. అప్పటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పుష్ప శ్రీవాణిని కలిసి సమస్యల్ని వివరించినా ఆమె పట్టించుకోలేదు. ఆ తర్వాత మంత్రి అయిన రాజన్నదొర కూడా అదే దారిలో నడిచారు. ప్రభుత్వం మారితే తమ బతుకులు మారుతాయని భావించి టిడిపి కూటమి పార్టీలకు మద్దతు తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా మరి కొద్ది నెలల్లో డిఎస్సీ జరగనున్న నేపథ్యంలో వీరంతా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. డిఎస్సీ నుంచి మినహాయించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ప్రభుత్వ పెద్దలు, మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతులు అందజేశారు. అయినా స్పందన లేదు. గత 15రోజులుగా సమ్మె చేస్తూ ఐటిడిఎ కార్యాలయాల ఎదుట దీక్షలు చేపడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ఐటిడిఎల ఎదుట దీక్షలు చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. దీంతో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం కూడా ప్రత్యామ్నాయ పోరాటాలపై యోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. తాము ఎదుర్కొంటున్న జీవన్మరణ సమస్య పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిలో మార్పు లేకపోవడంతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు.

నేనెలా బతకాలి?: అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుడు ఎం.రమణ

నా వయస్సు 58 సంవత్సరాలు. 2006 నుంచి అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. నాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మరో ఏడాదిన్నరలో ఉద్యోగ విరమణ చేయాలి. నాలాంటి వారు చాలా మంది పని చేస్తున్నారు. నేను పిజిటిగా పని చేస్తున్నా, నాకు టిజిటి జీతమే చెల్లిస్తున్నారు. ఇప్పుడు నాకు డిఎస్సీకి అర్హత లేదు. నా పరిస్థితి ఏమిటి? ఈ ఉద్యోగమే ఆధారమనుకుని బతుకుతున్నాను. రేపటి డిఎస్సీ తర్వాత నా ఉద్యోగం పోతుంది. నాకుటుంబం రోడ్డు మీద పడాల్సిందేనా?



సీతంపేట : మెడకు ఉరితాళ్లు బిగించుకుంటూ నిరసన తెలుపుతున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

మెడకు ఉరి వేసుకుంటూ వినూత్నరీతిలో నిరసన

సీతంపేట : న్యాయమైన హక్కుల కోసం పోరాటం చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు ఐటిడిఎ ముఖద్వారం వద్ద చేపట్టిన దీక్షలు సోమవారానికి 13వ రోజు చేరుకున్నాయి. మెడకు ఉరి వేసుకుంటూ వినూత్న రీతిలో నిరాహార దీక్షలు చేపట్టారు. ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ స్థానిక హై స్కూల్ మైదానం నుంచి ఐటిడిఎ వరకు శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చేంత వరకు పోరాటం కొనసాగుంతుందని తెలిపారు. నిరసన దీక్షకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఉపాధక్షులు వాబ యోగి, ఆదివాసీ జెఎసి సీతంపేట అధ్యక్షులు బిడ్డిక శ్రీనివాసరావు ఉమామహేశ్వరరావు, రామ్మోహన్‌రావు సంఘీభావం తెలిపారు.

శిక్షణార్థులంతా పోస్టులు సాధించాలి : మంత్రి

గిరి ప్రతిభ - ఉచిత డిఎస్‌సి కోచింగ్ ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరి ప్రతిభ - ఉచిత డీఎస్సీ కోచింగ్‌ను రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సోమవారం ప్రారంభించారు. స్థానికఐటిడిఎ ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ కోచింగ్‌ను గిరిజన విద్యార్థులకు గిరిజన సామాజిక భవనంలో ప్రారంభించారు. ఈ కోచింగ్ రెండు నెలల పాటు కొనసాగుతుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదట సారిగా జిల్లాలో ఉచిత డిఎస్‌సి శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. కోచింగ్ తీసుకున్నవారంతా ఉపాధ్యాయ పోస్టులు సాధిస్తారని ఆమె ఆకాంక్షించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా ఉన్న ఉపాధ్యాయులు స్పెషల్ డిఎస్సీ వద్దు అనడం సమంజసం కాదన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో రూ.8000కు ఉద్యోగం చేస్తుంటే 2016లో అప్పటి ముఖ్య మంత్రిగా రూ.16వేలకు చంద్రబాబు నాయుడు పెంచారని తెలిపారు. వీరిని ఉద్యోగాల నుండి తొలగించడం లేదని స్పష్టం చేశారు. డీఎస్సీలో 2వేల పోస్టులు గిరిజనులకు కేటాయించామని చెప్పారు. జిల్లాలో 4 బెడ్‌లతో కంటైనర్ ఆసుపత్రులు ఏర్పాటు చేశామని, త్వరలో కురుపాం, పాలకొండ నియోజక వర్గాల్లో ప్రారంభిస్తామని తెలిపారు. కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర మాట్లాడుతూ విశాఖకు టిసిఎస్ వస్తుందని, 10 వేల ఉద్యోగాలు వస్తున్నాయని చెప్పారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ సీతంపేట ఐటిడిఎ ప్రాంతంలో మరో కోచింగ్ ఏర్పాటు చేస్తామని, అవసరమైతే గుమ్మలక్ష్మీపురం వంటి చోట్ల కూడా ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గిరి ప్రతిభ ద్వారా అన్ని రకాల ఉద్యోగాలకు శిక్షణ ఇస్తామని చెప్పారు. ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు 230 దరఖాస్తులు అందగా, వారికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి వంద మందిని ఎంపిక చేశామన్నారు. స్టడీ మెటీరియల్, స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. మధ్యాహ్నం ఉచిత భోజన సౌకర్యం కల్పించామని చెప్పారు. ఈ సందర్భంగా గిరిజన సాధికార భవన ప్రాంగణంలో మునగ మొక్కలను మంత్రి నాటారు.



గిరిప్రతిభ-ఉచిత డిఎస్‌సి శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి



రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్

క్రీడల్లో మెరగవ్వాలి : మంత్రి

జన జాతీయ గౌరవ దివాస్ -2024 కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మంత్రి సంధ్యారాణి అభినందనలు తెలిపారు. గిరి ప్రతిభ కార్యక్రమం ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రి క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా విజేతలకు అవార్డులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. రాష్ట్ర స్థాయి పోటీలు పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి విజేతలుగా నిలిచి మన జిల్లా పేరును నిలిపారని ఆమె ఆకాంక్షించారు. విద్యలో కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పొగాకు దుష్ప్రభావంపై వైద్య, ఆరోగ్యశాఖ రూపొందించిన పోస్టర్‌ను మంత్రి విడుదల చేశారు. కార్యక్రమంలో డిఇఒ ఎన్.తిరుపతి నాయుడు, ఐటిడిఎ ఎపిఒ మురళీధర్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో ఎయిర్ ఫోర్స్ ఉద్యోగాల పట్ల అవగాహన సదస్సులు

ఎయిర్ ఫోర్స్ ఉద్యోగాలపై యువతలో అవగాహన కల్పించేందుకు ఈనెల 6, 7 తేదీల్లో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. యువతకు అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని వాటిని యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈనెల 6న సీతంపేటలో, 7నన పార్వతీపురంలో ఎయిర్ ఫోర్స్ ఉద్యోగాల పట్ల అవగాహన ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. యువత సదస్సుకు హాజరై సంబంధిత ఉద్యోగాల పట్ల అవగాహన చేసుకోవడం, వాటిలో విజయం సాధించుటకు కృషి చేయాలని కోరారు.

మంత్రి తీరు బాధ్యతా రాహిత్యం : ప్రజాసంఘాలు

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం, అర్ధ రహితంగా ఉన్నాయని పలు పార్టీలు, ప్రజాసంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ మేరకు గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం నాయకులు రెడ్డి వేణు, సిపిఐ నాయకులు కూరంగి మన్మథరావు, తోట జీవ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, లిబరేషన్ నాయకులు బొత్స నర్సింగరావు, పి.సంఘం, రైతు కూలీ సంఘం నాయకులు పి.శ్రీనునాయుడు, సిఐటియు నాయకులు గొర్లి వెంకట రమణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొల్లి గంగునాయుడు, మండంగి సూరయ్య, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కూరంగి సీతారాం, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిర, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు పి.రమణి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, కె.భాస్కరావు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి నాయకులు బివి రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.రాజు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్, ఎవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కూరంగి గోపి నాయుడు, ట్రైబల్ రైట్స్ ఫోరమ్ నాయకులు రబ్బ లోవరాజు, టిఎస్ఎఫ్ నాయకులు పాలవలస భగవాన్, ఇతర నాయకులు కొల్లి సంబమూర్తి,పి. రాజశేఖర్, అఖిల్, డేవిడ్, సూరిబాబు, ఉమా తదితరులు మాట్లాడారు. పోరాటాల వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని మంత్రి వ్యాఖ్యలు చేయడం అర్ధరహితం అన్నారు. మంత్రి తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మీరు, మీ పార్టీ ఎన్నికల ముందు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేరిస్తే పోరాటాల అవసరం రాదని హితవు పలికారు. గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు తెలివైన వారని ఒకసారి, అర్హులు కారని మరో సారి అవగాహన లేకుండా మాట్లాడడం మాను కోవాలని సూచించారు. తక్షణం గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల, అధ్యాపకుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే తీవ్రంగా స్పందించాల్సి ఉంటుందాని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

పిఎంఎవై ఇళ్లకు పేర్లు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-అర్బన్ (పిఎంఎవై-యు) పథకం కింద లబ్ధిదారులు నమోదు చేసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ పథకంలో నమోదు చేసుకోవడానికి భార్య, భర్తల సంతకం చేసిన ఆధార్ కార్డులు నకలు, రేషన్ కార్డ్ జిరాక్స్ కాపీలు, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ మొదటి పేజీ జిరాక్స్ కాపీ, స్థలం అనుబంధ పత్రం లేదా స్థలం రిజిస్టర్ డాక్యుమెంట్, ఇసి ఆదాయ, కులధ్రువీకరణ పత్రాలు, ప్రస్తుత ఇంటి స్థలం కెమెరా ఫోటో, 4-బి హౌసింగ్ అప్లికేషన్ తదితర డాక్యుమెంట్స్ అన్నిటిని 4బి ఫామ్‌కు జత చేసుకోవాలని వివరించారు. ఈ మేరకు కేంద్ర పట్టణ వ్యవహారాలు, గృహ నిర్మాణ విభాగం ఉత్తర్వులు జారీ చేశారని ఆయన అన్నారు.

సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుకు ఇంటర్వ్యూ

ప్రజాశక్తి - పార్వతీపురం

జియ్యమ్మవలస మండలం చిన్నమేరంగి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ (గైనిక్) పోస్టును కాంట్రాక్టు పద్ధతిపై నియామకానికి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్, డిఎస్‌సి చైర్మన్ ఎ.శ్యామ్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత కలిగి, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 6న జిల్లా కలెక్టర్ కార్యాలయం పిజిఆర్ఎస్ సమావేశ మందిరం (సెల్లార్ లో) హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు. హాజరు అయ్యే అభ్యర్థులు దరఖాస్తుతో పాటు సంబంధిత ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, జెరాక్స్ కాపీలు, ఫోటోలతో వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆయన సూచించారు.

పెంచిన విద్యుత్తు ఛార్జీలు ఉపసంహరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

పెంచిన అన్ని రకాల విద్యుత్ ఛార్జీలను తక్షణమే ఉపసంహరించాలని సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎం ఎల్ న్యూ డెమోక్రసీ, లిబరేషన్ నాయకులు రెడ్డి వేణు, తోట జీవ, బొత్స నర్సింగరావు, పోలా రమణి, పి.సంగం, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎటువంటి విద్యుత్ భారాలు ప్రజలపై వేయబోమని చెప్పి విద్యుత్ చార్జీలు పెంచడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడో వినియోగించిన విద్యుత్‌కు ఇప్పుడు ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజల నుంచి డబ్బులు సర్‌ఛార్జీల రూపంలో వసూళ్ళు చేయడం అర్థం లేదని అన్నారు. ఎటువంటి ప్రజాభిప్రాయం లేకుండా విద్యుత్ ఛార్జీలు పెంచడం సరైంది కాదన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జడ్జి విజయరాజ్

ఆశ్రమ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దోనుభాయి, సామరెల్లి, పెద్ద పొల్ల గిరిజన ఆశ్రమ పాఠశాలను పాలకొండ జడ్జి ఎ.విజయరాజ్ కుమార్ సోమవారం సందర్శించారు విద్యార్థుల మెనూ పరిశీలించారు. మరుగుదొడ్లు, తాగునీరు, పాఠశాల ప్రాంగణం పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య గురించి తెలుసుకున్నారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని ఆకాంపించారు. ఆయన వెంట లాయర్ శామ్యూల్ ప్రధానోపాధ్యాయులు ఎ. భాస్కర రావు, ఎం భాస్కరరావు, సుకుమార్ డిప్యూటీ వార్డెన్స్ అప్పన్న సుబ్బారావు, ఎం.రవి తదితరులు పాల్గొన్నారు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ధ్యేయంగా పనిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్, జెసి, సబ్ కలెక్టర్ వినతులను స్వీకరించగా 108 వినతులు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని హితవు పలికారు. సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, తద్వారా అర్జీదారుడు సంతృప్తిని వ్యక్తం చేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితిల్లో అర్జీలు పెండింగ్ ఉండరాదని, రీ ఓపెన్ కారాదని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. పిజిఆర్ఎస్‌కు జిల్లా అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని, రెండు జిల్లాల్లో పనిచేసే అధికారులు ఒక వారం ఈ జిల్లాలో, తదుపరి వారం ఇతర జిల్లాలో హాజరుకావాలని వివరించారు. అలాగే ప్రతి శాఖలో ఒక నోడల్ అధికారి ఉండాలని, ఎప్పటికప్పుడు అర్జీలను పరిశీలించి నాణ్యమైన పరిష్కారం ఇచ్చేలా పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పలువురు జిల్లాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పొగాకు నియంత్రణ చట్టాల పోస్టరు విడుదల

జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం (ఎన్‌టిసిపి) లో భాగంగా పొగాకు నియంత్రణ చట్టాలు, పొగాకు వల్ల కలిగే నష్టాలపై పోస్టర్లను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఇతర అధికారులతో కలిసి విడుదల చేశారు. జాతీయ పొగాకు నియంత్రణ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం కలెక్టరేట్లో గల పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జెసి ఎస్ఎస్ శోబిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, కెఆర్ఆర్సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రా ఒడ్డి,జిల్లా ఎయిడ్స్, టీబీ, లెప్రసీ నియంత్రణ అధికారి డాక్టర్ ఎం.వినోద్ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ టి.జగన్మోహన్‌రావు, డిపిఎం భవాని, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వికలాంగునికి ట్రైసైకిల్ అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

వికలాంగులకు పరికరాలు అందజేత కలెక్టర్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో దరఖాస్తు చేసుకున్న ఇద్దరు వికలాంగులకు కలెక్టర్ ట్రైసైకిల్, బ్లైండ్ స్టిక్‌ను అందజేశారు. చింతాడకు చెందిన తోట ప్రసాద్‌కు ట్రైసైకిల్‌ను, పాలకొండ మండలం పెదకోటిపల్లికి చెందిన పలక దుర్గారావుకు ఎలక్ట్రానిక్ బ్లైండ్ స్టిక్‌ను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం


పార్వతీపురం : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు మరింత వేగవంతం కావాలని, ప్రక్రియ సక్రమంగా జరగాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరం నుంచి సబ్ కలెక్టర్లు, మండల అధికారులతో ధాన్యం కొనుగోలు, పీజీఆర్ఎస్, ఇతర అంశాలపై జేసీ ఎస్ఎస్ శోబికతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అన్నారు. జిల్లాలో వువా (వాటర్ యూజర్స్ అసోసియేషన్) ఎన్నికలకు సంబంధించి ఓటర్ జాబితాలు సిద్ధంగా ఉండాలన్నారు. ఈనెల 5న జాబితా ప్రచురణ, 6న గ్రామాల్లో టామ్ టామ్ చేయించాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో అభ్యర్థులు పాల్గొనేలా చేయాలని, పోలింగ్ స్టేషన్లను ముందుగా సిద్ధం చేసుకొని ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులు కృషి చేయాలని తెలిపారు. తహశీల్దార్లు నీటిపారుదల శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో పలుశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'అత్యం' మైనింగ్ ఆగడాలను అరికట్టండి

కలెక్టర్‌కు నాయకుల వినతి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లాలోని గరుగుబిల్లి మండలంలో విధ్వంసం చేస్తున్న అత్యం మైనింగ్ కంపెనీ ఆగడాలను అరికట్టాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వి.దాలినాయుడు, బాధిత గ్రామాలకు చెందిన పెద్దలు నెల్లి లక్ష్మీనాయుడు, పోలిరోతు చంద్రశేఖర రావు, నెల్లి సింహాచలం నాయుడు తదితరులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు వినతిని పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సుమారు 20 ఏళ్ల క్రితం గరుగుబిల్లి మండలంలో మైనింగ్ చేపట్టిన అత్యం మైనింగ్ కంపెనీ మండలంలోని చినగుడబ, గదబవలస, పెదగుడబ, కొంకడివరం, శివరాంపురం, బాలగుడబ, వల్లరిగుడబ, ఎస్సార్ పేట తదితర గ్రామాల్లోని సుమారు 200 అడుగులు ఎత్తున ఉన్న నెల్లివారి మెట్ట, ఎన్ని వారిని మెట్టలపే తవ్వేశారన్నారు. అక్కడితో ఆగకుండా ఆ కొండలు ఉండే ప్రదేశంలోని సుమారుగా వంద అడుగుల లోతు ప్రమాదకర తవ్వకాలు జరిపారన్నారు.వీటితో పాటు తారు, ఇటుకల పరిశ్రమను నిర్వహించి పర్యావరణం కలుషితం చేస్తున్నారన్నారు. ఇక్కడ మెటీరియల్ విజయవాడ, విశాఖ, రాయగడ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారన్నారు. సుమారు 1300 ఎకరాల విస్తీర్ణం గల ఈ కొండల్లో వెయ్యి ఎకరాల వరకు కబ్జా చేశారని ఆరోపించారు. కొండ నుంచి నెల్లివాని చెరువుకి వెళ్లే నెల్లివానిగెడ్డను పూర్తిగా కప్పేశారని, ఒడుగుల వాణి చెరువుకు, చింతవాని చెరువుకు వచ్చే ఒడుగులువాని గెడ్డ కూడా కబ్జాకు గురైందన్నారు. నెల్లివాని చెరువుకు జంఝావతి కాలువ నీరు రావాల్సి ఉండగా, దాన్ని కప్పేసి లారీలు నడిపేందుకు రహదారిగా మార్చారని, జంఝావతి కాలువ నుండి నెల్లివాని చెరువుకు వచ్చిన నీరు, సమీపంలో ఉన్న 26 చెరువులకు వచ్చేదని, ఇప్పుడు నెల్లివారి చెరువులో నీరు లేకపోవడంతో ఆయా చెరువులు ఎండిపోయావని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సుమారు 600 ఎకరాలకు సాగునీరందడంలేదన్నారు. మైనింగ్ సమీప ప్రాంతాలకు సంబంధించి మైనింగ్ రాయి, బుగ్గిపడి 150 ఎకరాల వరకు పంట పొలాలు సాగుకు పనికి రాకుండా పోయావని, అత్యం మైనింగ్ వల్ల ఊపిరితిత్తుల వ్యాధులతో పది మంది వరకు చనిపోయారని అన్నారు. ఇప్పుడు ఆయా గ్రామాల్లో మరో 10మంది వరకు బాధపడుతున్నారన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి పామాయిల్ తోటలు వేశారని, నిబంధనలు మీరి మైనింగ్ చేస్తున్నా కంపెనీపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగాకలెక్టర్ మాట్లాడుతూ అత్యం మైనింగ్ క్వారీకి అధికారుల బృందాన్ని పంపిస్తామన్నారు. తాను కూడా క్షేత్ర పర్యటన చేస్తానని హామీ ఇచ్చారు.



కలెక్టర్‌కు వినతిని పత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఏనుగులతో చితికిపోతున్న రైతులు

నష్టపోయిన పంటను పరిశీలించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి - కొమరాడ

జిల్లాలో ఏడేళ్ల క్రితం తిష్ట వేసిన ఏనుగుల గుంపుతో రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని కుమ్మరిగుంటలో సోమవారం వేకువ జామున ఏనుగులు కుమ్మేసిన పంట పొలాలను పరిశీలించారు. చేతికి అందించిన టమోటా, వరి, అరటి తదితర కూరగాయ పంటలను ఏనుగులు గుంపు గత నెల రోజులుగా ధ్వంసం చేస్తున్నాయని, దీంతో లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట ఆశించిన సమయానికి ఏనుగుల గుంపు రూపంలో నష్టపోతున్నామని రైతులు సిపిఎం నాయకులు వద్ద వాపోయారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ ఏనుగుల బారి నుంచి రైతులకు ఎటువంటి భరోసా లేదన్నారు. కనీసం ఏనుగుల గుంపు ఎటువైపు సంచరిస్తున్నాయో అటువైపు రైతులను, ప్రజలను అప్రమత్తం చేసే పరిస్థితి కూడా అటవీ శాఖ అధికారులకు లేదని అన్నారు. గత మూడేళ్లుగా ఈ ప్రాంతాల్లో నష్టపోయిన రైతులకు పూర్తిగా పరిహారం ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏనుగుల తరలింపునకు కనీసం ఎటువంటి చర్యలు చేపట్టక పోగా, కనీసం పంటలకైనా నష్టపరిహారం ఇచ్చి ఆదుకునేలా కృషి చేయాలని కోరారు. ఇప్పటికే ఈ ప్రాంత ఏనుగులు పంటలను నాశనం చేయడంతో బిక్కుబిక్కుమంటూ సాగు చేస్తున్న రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని అన్నారు. పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో రైతులు ఆర్థికంగా చితికి పోతున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల గుంపున శాశ్వతంగా అటవీ ప్రాంతానికి, జూకు తరలించి ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్తులో రైతులతో కలిసి ఆందోళన మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వి.ఇందిర, నాయకులు కొల్లి సాంబమూర్తి, రైతులు అచ్యుతరావు, సింహాచలం, కుమ్మరి గుంట రైతులు పాల్గొన్నారు.



ఏనుగు ధ్వంసం చేసిన టమోటా పంటను చూపుతున్న రైతులు



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న సిపిఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు

గిరిజన యూనివర్సిటీని ఇక్కడే కొనసాగించాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన యూనివర్సిటీని మన్యం జిల్లాలోనే కొనసాగించాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులతో కలిసి గిరిజన యూనివర్సిటీ గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యం జిల్లాలో శంకుస్థాపన చేసి నిర్మాణ దశలో ఉన్న గిరిజన యూనివర్సిటీని ప్రభుత్వం మన్యం జిల్లా నుండి తరలించాలని చూడటం అంటే గిరిజన విద్యార్థులకు యూనివర్సిటీ విద్యను దూరం చేయడమేనని అన్నారు. ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకుని మన్యం జిల్లాలోనే యూనివర్సిటీ నిర్మాణ పనులు పూర్తి చేసి తరగతులు ప్రారంభించాలని సిపిఎం పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.తిరుపతిరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి రహదారి సమస్య

ప్రజాశక్తి- సాలూరు

మండలంలోని శంబర గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. సుమారు రూ.2.4 కోట్లతో సిసి రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నడమి వీధిలో రోడ్డు నిర్మాణం వల్ల ముగడ అమ్మడమ్మ ఇంటికి సమస్య తలెత్తింది. దీనిపై స్థానిక టిడిపి నాయకుడు నైదాన సూర్యయాదవ్ స్పందించి అమ్మడమ్మ సమస్యని మంత్రి సంధ్యారాణి దృష్టికి తీసుకెళ్లారు. అమ్మడమ్మ ఇంటికి ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలని మంత్రి సంధ్యారాణి ఆదేశించడంతో సమస్య పరిష్కారమయిందని టిడిపి నాయకుడు నైదాన సూర్య యాదవ్ చెప్పారు.



అమ్మడమ్మతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

ప్రకృతి సాగు కూరగాయల అమ్మకం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎటువంటి రసాయన ఎరువు లేకుండా స్వచ్ఛమైన ప్రకృతి సాగుచేసిన కూరగాయలను స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఆవరణంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అమ్మకాలు చేపట్టారు. రసాయన ఎరువుల్లేని కూరగాయలను కొనుగోలు చేసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున వచ్చారు. ప్రకృతి పంట ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కోఆర్డినేటర్ కిమిడి భూషణ తెలిపారు. ప్రతి గ్రామంలో రైతులు తమకున్న ఖాళీ స్థలంలో ప్రకృతి వ్యవసాయ పంటలు పండించాలని కోరారు.

వీధి దీపాలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్ పేట పంచాయతీ పరిధిలో గల సవర కలిగొట్టు, జాతపు కలిగొట్టు గ్రామాల్లో వీధి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. పై గ్రామాల్లో విద్యుత్ వీధి దీపాలు లేకపోవడంతో ప్రజలు అంధకారంలో ఉంటున్నారని గుర్తించిన సర్పంచ్ ఆర్.చైతన్య స్రవంతి స్పందించి సోమవారం దగ్గరుండి వీధి దీపాలు వేయించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు డి.నాగరాజు, ఎ.నరేష్ ఉన్నారు



వీధి దీపాలను పరిశీలిస్తున్న సర్పంచ్ చైతన్య

8న మాలల గర్జన

ప్రజాశక్తి - పాలకొండ

వర్గీకరణ తీర్పునకు వ్యతిరేకంగా ఈనెల 8న నిర్వహించనున్న ఉత్తరాంధ్ర మాలల గర్జన పోస్టర్‌ను సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దళిత సంఘం నాయకులు వై.లిల్లీపుష్పం, భరత్ భూషణ్, బత్తిన మోహన్ మాట్లాడుతూ మాలల ఐక్యతను పాలకులకు తెలియజేసేందుకు ప్రతి ఒక్కరూ ఈనెల8న విశాఖపట్నం తరలిరావాలని కోరారు.

పలువురికి ఎమ్మెల్సీ విక్రాంత్ పరామర్శ

ప్రజాశక్తి -పాలకొండ

పట్టణానికి చెందిన ఎంఎం నగర్‌లో నివాసం ఉంటున్న రెడ్డి సన్యాసిరావు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే ఇందిరానగర్ కాలనీకి చెందిన డబీరు ప్రసాదరావు కుటుంబంలో ఇద్దరు వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని, దుప్పాడ నరసింహమూర్తి (మాజీ వార్డు మెంబర్) కుటుంబానికి తన సంతాపాన్ని తెలిపారు. పరామర్శించిన వారిలో వైసిపి నాయకులు పాలవలస ధవళేశ్వరరావు, దుప్పాడ పాపినాయుడు, కడగల వెంకటరమణ, బాసూరు కాంతారావు తదితరులు ఉన్నారు.

చలివేంద్రిలో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రీ గ్రామంలో సోమవారం స్థానిక వైద్యాధికారి ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, మధుమేహ, రక్త పోటు, గర్భిణులు, ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం

వీరఘట్టం: మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాధులు ప్రబల్లే అవకాశం ఉందని, వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, ప్రదీప్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లోనికి వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకొని తమకు సమాచారం ఇవ్వాలన్నారు. జ్వరాలు ఉన్నట్లయితే రక్త నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ఆరోగ్య కేంద్రానికి అందజేయాలన్నారు. గ్రామ ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జనార్దన్‌రావు, శాంతకుమారి, ఆదిలక్ష్మి, ఎంఎల్ హెచ్‌పిలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

240 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రం సమీపంలో గల మూలిగూడ జంక్షన్ వద్ద సోమవారం ఇద్దరు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలతో నాటు సారా తరలిస్తుండగా పట్టుకున్నామని ఎఎస్ఐ నర సింహులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు మూలిగూడ జంక్షన్ వద్దకు వెళ్లి కాపు కాయగా ఒడిశా నుంచి చిరమేరంగి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలతో ఆరు ట్యూబుల్లో 240 లీటర్లు నాటుసారాను వారి గ్రామానికి తరలిస్తుండగా పట్టుకున్నా మన్నారు. సారాను ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

5 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- పాచిపెంట

మండంలోని పి.కోనవలస చెక్‌పోస్టు సమీపంలో సోమవారం కోరాపుట్ టౌన్ ఒడిస్సా రాష్ట్రానికి చెందిన చిన్మయ మహారాణా అనే వ్యక్తి వద్ద 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని అతన్ని అదుపులో తీసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసే రిమాండ్కుఉ తరలించామని ఎస్ఐ వెంకటసురేష్ తెలిపారు. సదరు వ్యక్తి ఆ గంజాయిని కోరాపోట్ నుంచి విశాఖపట్నం తీసుకెళు తున్నట్టుగా ఆయన వివరించారు.

ట్రైబల్ వెల్ఫేర్ టీచర్లకు డెప్యుటేషన్ వద్దు

ప్రజాశక్తి- సీతంపేట

ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాంట్రాక్ట్ టీచర్ల సమ్మె సందర్భంగా వారి స్థానాల్లో ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ స్కూల్ టీచర్లను డిప్యుటేషన్లు వేయడం సరికాదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మురళీమోహన్‌రావు, గౌరవ అధ్యక్షులు ఎ.భాస్కరరావు జిల్లా కార్యదర్శి కె. కృష్ణారావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్ రెడ్డి ఐటిడిఎలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పిఒకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ రెసిడెన్షియల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి తప్ప వారి స్థానాల్లో ట్రైబల్ వెల్ఫేర్ టీచర్లను డిప్యుటేషన్ వేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పరిధిలోని గిరిజన ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలను సమర్పించారు. మండలంలోని కుంబి గ్రామానికి చెందిన కూరంగి రామారావు వ్యవసాయ పైపులు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. నల్లరాయిగూడ గ్రామానికి చెందిన బి.సూకయ్య గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి భవనాన్ని మంజూరు చేయాలని, ఇదపాడు కొత్తగూడ గ్రామానికి చెందిన సవర సీతమ్మ వితంతు పింఛను మంజూరు చేయాలని, బుక్కిడిగూడ గ్రామస్తులు తమ గ్రామంలోని నీటి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. కొత్తూరు మండలం పెద్దరాజపురం గ్రామానికి చెందిన సవర గౌతమి పవర్ వీడర్ మంజూరు చేయాలని, జామితోట గ్రామం నుంచి కొండాడ గ్రామం వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. కుడ్డపల్లి గ్రామానికి చెందిన సవర గోపాలం మినీ ట్రాక్టర్ మంజూరు చేయాలని, వలగజ్జి గ్రామానికి చెందిన శ్రీనివాసరావు టార్పాలిన్ మంజూరు చేయాలని, కొత్తూరు మండలం దీపురపల్లి గ్రామానికి చెందిన సవర రవికుమార్ మేకల లోన్ మంజూరు చేయాలని, గులు మూరు గ్రామానికి చెందిన సవర సీతమ్మ కుట్టు మిషన్ మంజూరు చేయాలని, హిర మండలం పుట్టిగాం గ్రామస్తులు తమ ఊరికి రహదారి నిర్మించాలని, భామిని మండలం సొలికిరి గ్రామానికి చెందిన కడ్రక సరోజిని తనకు అటెండర్ పోస్టు ఇప్పించాలని వినతి పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఈఈ రమాదేవి, డిడి అన్నదొర పిహెచ్ఒ వెంకట్ గణేష్, వెలుగు ఎపిడి సన్యాసిరావు, డిప్యూటీ డిఇఒ నారాయుడు, ఏటిడబ్ల్యుఒ మంగవేణి, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసిన యుటిఎఫ్ నాయకులు

ఐటిడిఎ గ్రీవెన్స్‌కు 53 వినతులు



సీతంపేట: వినతి పత్రాన్నిస్తున్న యుటిఎఫ్ నాయకులు

నైట్ హాల్ట్ బస్సు నడపాలని వినతి

పార్వతీపురం: కొమరాడ మండలం కూనేరుకు నైట్ హాల్ట్ బస్సు నడపాలని, కళ్ళికోట, మసిమండ గ్రామాలకు బస్సులు నడపాలని కోరుతూ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.సాంబమూర్తి, వి.ఇందిర సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై కలెక్టర్ శ్యాంప్రసాద్ స్పందించి ఆర్‌టిసి అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సాంబమూర్తి, ఇందిరా మాట్లాడుతూ కూనేరు నైట్ హాల్ట్ బస్సు లేకపోవడం వల్ల సమీప గ్రామాల గిరిజనులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. సాయంత్రం 7.15 తర్వాత బస్సు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. కళ్ళికోట, మసిమండ గ్రామాలకు బస్సులు నడపాలని కోరినట్లు తెలిపారు. కొమరాడ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల నిర్మాణ పనులు పునః ప్రారంభించాలని కూడా కోరినట్లు చెప్పారు.

పరిష్కార వేదికకు స్పందన కరువు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు స్పందన కరువైంది. మండల స్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధిగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినప్పటికీ ప్రజల నుంచి స్పందన లేకపోతుంది. కాగా ఈ కార్యక్రమానికి కొన్ని శాఖల అధికారులు సైతం హాజరు కావడం లేదు. ప్రజా సమస్యల పరిష్కార వేదికపై ప్రజలకు అవగాహన లేకపోవడంతోనే స్పందన కరువవుతోంది. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో గోశాల మంజూరు చేయాలని గ్రామానికి చెందిన బొమ్మిడి లక్ష్మి నారాయణ, సూర్య నారాయణ ఎంపిడిఒ పి. త్రివిక్రమరావు, ఎపిఒ భాను తదిత రులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదికకు అధికారులు దుమ్మా

వీరఘట్టం: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం స్థానిక ఎంపిడిఒ బి.వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొట్టారు. ఎంఇఒ-1, గృహ నిర్మాణ శాఖ ఎఇ, పంచాయతీరాజ్ జెఇ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ, ఐసిడిఎస్ సూపర్వైజర్, వెలుగు, ఉపాధి హామీ శాఖల అధికారులు తప్ప మిగిలిన అన్ని శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. దీంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

రెగ్యులర్ విఆర్‌ఒను నియమించాలి

పార్వతీపురం టౌన్: మున్సిపల్ పరిధిలో గల 25,26 వార్డులకు సంబంధించిన 13వ వార్డు సచివాలయంలో ఉన్న రెవెన్యూ సెక్రటరీ బదిలీపై వెళ్లిపోయారని, ఆయన స్థానంలో రెగ్యులర్ సెక్రటరీని నియమించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ స్పందన కార్యక్రమంలో కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు, మున్సిపల్ స్పందన కార్యక్రమంలో మేనేజర్ లక్ష్మికి పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పాకల సన్యాసిరావు మాట్లాడుతూ పట్టణంలో 13వ సచివాలయం పరిధి గల 25,26 వార్డు పరిధిలో సుమారు 960 కుటుంబాలు నివసిస్తున్నాయని, వీరికి సేవలందించేందుకు గానూ రెగ్యులర్ విఆర్‌ఒ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యమైన సెక్రటరీ పోస్టు ఖాళీగా ఉండడంతో ఈ రెండు వార్డుల్లో సేవలు అంతంత మాత్రమే అందుతున్నాయన్నారు. కావున రెగ్యులర్ విఆర్‌ఒను నియమించాలని కోరారు.

విద్యార్థుల్లో రక్తహీనత లోపం ఉండరాదు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని ఆదర్శ పాఠశాలలు, కెజిబివిలు, సంక్షేమ వసతి గృహాల్లో చదివే విద్యార్థినుల్లో రక్తహీనత లోపం ఉండరాదని, లోపం ఉంటే ఆ వసతి గృహ వార్డెన్లపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వసతిగృహాల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతి నెలా జిల్లాలో చేపడుతున్న పల్లెనిద్ర, గ్రామదర్శిని కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నట్లు చెప్పారు. వసతి గృహల్లో గుర్తించిన సమస్యలపై ప్రత్యేక అధికారులు దృష్టి సారించి, పరిష్కరించడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన మూడు పల్లె నిద్రలు, గ్రామదర్శిని కార్యక్రమాల్లో గుర్తించిన అంశాలపై దృష్టి సారించడం వలన అక్కడ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఆ ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, అందులో భాగంగా ఇప్పటివరకు 156 సమస్యలను ప్రత్యేక అధికారులు గుర్తించినట్టు తెలిపారు. ప్రధానంగా వసతి గృహల్లోని విద్యార్థులు నేలపై పడుకోరాదని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇప్పటికే కొందరు అధికారులు దోమ తెరలను పంపిణీ చేశారని, మరికొందరు తరగతి గదులు, వసతి గృహల్లో లైట్లు, ఫ్యాన్లు ఇచ్చారని ఇది సంతోషకరమని చెప్పారు. వసతి గహాలు, ఆదర్శ, కెజిబివి పాఠశాలల్లో విద్యార్థినిలకు నాణ్యమైన భోజనంతో పాటు పాలు, గుడ్లు ఇస్తున్న నేపథ్యంలో రక్తహీనత లోపం ఉండరాదని కలెక్టర్ తేల్చిచెప్పారు. పిల్లలకు ఇస్తున్న భోజనం తీసుకోకపోతే వారికి ప్రత్యేక భోజనం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎనీమియా విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక రికార్డును నిర్వహించాలని అన్నారు. రక్తహీనత లోపం ఉండే వసతి గృహాల వార్డెన్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని తెలిపారు. హెల్త్ రికార్డులో ప్రతి నెలా మెడికల్ ఆఫీసర్, ఎఎన్ఎంల పర్యటన, మందులు, మెడికల్ చెకప్ తదితర వివరాలు ఆ రిపోర్ట్‌లో నమోదై ఉండాలని పేర్కొన్నారు. ఆయా పాఠశాలలు, వసతిగృహాల్లో ఇస్తున్న మెనూ, విద్యా ప్రమాణాలు, స్టడీ అవర్స్ సక్రమంగా జరుగుతున్నదీ లేనిదీ పరిశీలించాలని సూచించారు. ఆర్ఒ ప్లాంట్లు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అన్ని వసతి గహాలకు మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ ఉండాలని పేర్కొన్నారు. అలాగే దోమతెరలు, కిటకీలకు మెష్‌లు, అందరు విద్యార్థులకు పరుపులు ఉండాలని కలెక్టర్ తేల్చిచెప్పారు. గ్రామదర్శిని కార్యక్రమంలో ఎక్కువగా కాలువలు, పారిశుధ్యం, తాగునీరు, అంగన్వాడీల్లో వసతులు, భోజనం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామదర్శిని, పల్లె నిద్ర కార్యక్రమాలు విజయ వంతంగా నడవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ ఎస్.మన్మధరావు, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు, ఎల్‌డిఎం జె.ఎల్.ఎన్.మూర్తి, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి ఎస్.కృష్ణ, డ్వామా పిడి కె.రామచంద్రరావు, డిఆర్‌డిఎ వై.సత్యంనాయుడు, జిల్లా మత్స్య శాఖాధికారి వి.తిరుపతయ్య, జిల్లా ఉద్యాన వన శాఖాధికారి కెఎస్ వరప్రసాద్, జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి కె. సాయికృష్ణ చైతన్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ఒ.ప్రభాకరరావు, డివిఇఒ డి.మంజులవీణ, డిపిఒ టి.కొండలరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



చేప పిల్లలను చెరువులో విడిచిపెడుతున్న నాయకులు

చేప పిల్లలు పంపిణీ

భామిని: సీతంపేట ఐటిడిఎ ద్వారా ఉచితంగా అందించిన చేప పిల్లలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని మండల టిడిపి అధ్యక్షులు భోగాపురపు రవినాయుడు అన్నారు. మండలంలోని పసుకుడి, మనుమకొండ, బిచ్చమానుగూడ, వద్దంగిగూడ, పాలవలసలో సుమారు 42 చెరువుల్లో 49,400 చేప పిల్లలను ఐటిడిఎ ద్వారా ఉచితంగా పంపిణి చేశారు. పంపిణీ చేసిన చేపపిల్లలను సోమవారం చెరువుల్లో వదిలారు. కార్యక్రమంలో గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ నిమ్మక నిబ్బరం, మనం కొండ సర్పంచ్ కేశవ్, పాల వలస సర్పంచ్ తమ్మారావు, పసుకుడి సర్పంచ్ భార్గవ్‌నాయుడు, గ్రామస్తులు అప్పలనాయుడు, ఎపిఎం చక్రపాణి, ఎపిఒ తులసీదాస్, మత్స్య సహాయకులు కె.ఆదినారాయణ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- సీతంపేట

గిరిజనులకు, ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్యం అందించి ఆసుపత్రికి మంచి పేరు తీసుకురావాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. సోమవారం సీతంపేట ఏరియా ఆసుపత్రిలో అభివృద్ధి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోగులకు డైట్ చార్ట్ ప్రకారం మెనూ అందించాలన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే గిరిజనులకు మరింత వైద్య సదుపాయాలు కలుగుతాయన్నారు. ఇప్పటికే ప్రభుత్వం విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందని చెప్పారు. 80 నుంచి 100 వరకు నెలకు ప్రసవాలు జరుగుతుండడటం మంచిదేనని వైద్యులు, సిబ్బంది కొరతపై ఆరోగ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఆ సమస్యను పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రాంతంలో మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేయాలని ఇప్పటికే సిఎం దృష్టికి తీసుకుని వెళ్లానని చెప్పారు. మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు ఏరియా ఆసుపత్రి నిర్మాణం పనులు వేగవంతంగా చేయాలని నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఇంజనీర్లకు, కాంట్రాక్టులకు ఆదేశించారు. ప్రభుత్వం బిల్లులు వెంటనే చెల్లిస్తుందని చెప్పారు.



బ్లండ్ బ్యాంకు గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బ్లడ్ బ్యాంకు గది ప్రారంభం

ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ నిల్వ గదిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లడ్ బ్యాంక్ నిల్వ గది ఉండడం ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ ప్రాంతంలో సికిల్ సెల్ ఎనీమియా, తలసీమయ వ్యాధిగ్రస్తులు 180 మంది ఉన్నారని చెప్పారు. దీనిని వినియోగించుకోవాలని అన్నారు. అనంతరం ఆర్ఎంఒ సూపరిండెంట్ సాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు సంధ్యారాణి, గణేష్, కూటమి నాయకులు ఇమరక పవన్, ఎంఎంఎస్ అధ్యక్షులు వరలక్ష్మి, ఎంపిడిఒ గీతాంజలి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు, ఆర్ఎంఒ శ్రీనివాస్, కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించాలి

కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రధాన రహదారి విస్తీర్ణ అభివృద్ధి పనుల్లో భాగంగా అంబేద్కర్ జంక్షన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించారని అదే స్థానంలో మరలా అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించాలని కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎన్ సింహాచలం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కుల వివక్ష పోరాట సంఘ నాయకుల ఆధ్వర్యంలో తొలగించిన విగ్రహాన్ని ఎక్కడ పెట్టారని పరిశీలన చేయగా పోలీస్ స్టేషన్ గోడ పక్కన తుప్పల్లో అనాధ విగ్రహంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో ఆ జంక్షన్‌కు అంబేద్కర్ జంక్షన్‌ని పేరు వచ్చిందని అన్నారు. రహదారి విస్తీర్ణం పనులు పూర్తయి ఏడు నెలలు కావస్తున్నప్పటికీ రోడ్లు, భవనాల శాఖ అధికారులు, పంచాయతీ అధికారులు, కాంట్రాక్టర్ ఇంతవరకు విగ్రహాన్ని ప్రతిష్టించలేదన్నారు. విగ్రహాన్ని కూడా సక్రంగా భద్రపరచలేదన్నారు. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల అంబేద్కర్ విగ్రహం అనాధగా పడి ఉందని దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, వెంటనే తొలగి ంచిన చోట అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టిం చాలని డిమాండ్ చేశారు. ఈయనతో పాటు మండల నాయకులు కె.సింహాచలం, ఎన్ ప్రసాద్‌రావు, ఆర్ శశిభూషణ రావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నాయకులు

ముగ్గురికి ఎఇఒలుగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి- సీతానగరం

మండల పరిధిలోని అంటిపేట, లచ్చయ్యపేట, చినబోగిలి గ్రామ సచివాలయాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న జగదీష్, లక్ష్మణరావు, సౌజన్యలు ఎఇఒలుగా పదోన్నతి పొందారు. ఈమేరకు సోమవారం ఆర్డర్లు అందుకున్నారు. అంటిపేట గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఎఇఒగా పదోన్నతి పొందిన జగదీష్‌ను కొమరాడ గ్రామ సచివాలయంలో నియమించారు. చినబోగిలి అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సౌజన్యకు మక్కువ మండలం వెంకట భైరిపురానికి, లచ్చయ్యపేట సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న లక్ష్మణరావుకు మక్కువకు పదోన్నతిపై బదిలీ చేసినట్లు ఎఒ ఎస్ అవినాష్ తెలిపారు. అనంతరం వీరిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన ఉద్యోగులు మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు.



బస్సులు కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు

బస్సుల్లేక విద్యార్థులకు అవస్థలు

ప్రజాశక్తి - మక్కువ

మండలం నుంచి చినబోగిలి, పార్వతీపురం వెళ్లే ప్రయాణికులకు, విద్యార్థులకు సకాలంలో బస్సులు రాక అవస్థలు తప్పడం లేదు. విద్యా సంస్థలు నాలుగు గంటల తర్వాత విడిచిపెట్టినప్పటికీ బస్సులు లేకపోవడంతో రాత్రి సమయం వరకు వేచిచూడాల్సిన పరిస్థితి. రెండు రోజులుగా ఒకే బస్సు పార్వతీపురం నుంచి మక్కువకు వస్తుండడంతో ఈ అవస్థలు తప్పడం లేదని వారంతా ఆవేదన చెందుతున్నారు. బడి బస్సు కూడా ఆరున్నర దాటే వరకు రాకపోవడంతో రోడ్డుపైనే ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందని విద్యార్థులు చెబుతున్నారు. విద్యార్థినిలు వచ్చే వరకు తల్లిదండ్రులకు ఆందోళన తప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌టిసి అధికారులు స్పందించి సకాలంలో బస్సులు వచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

లావణ్యకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - కురుపాం

ట్రైకర్ బోర్డు మెంబర్‌గా పువ్వల లావణ్య పదవీ బాధ్యతలు చేపట్టి మొదటిసారి మండలంలో గుమ్మడిగూడ పంచాయతీ సంగెడ్డ గ్రామం సోమవారం సాయంత్రం వెళ్లిన నేపథ్యంలో ఆ గ్రామ గిరిజన ప్రజలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె గిరిజన ప్రజల కష్టాలు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజన యువతకు, గిరిజన ప్రజలకు ట్రైకర్ లోన్లు అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో తనకు గిరిజనులకు సేవ చేసే విధంగా ట్రైకర్ మెంబర్ పదవి రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. గ్రామంలో అందరూ టిడిపి సభ్యత్వం నమోదు చేయడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. దీని వల్ల అనుకోని సంఘటనలో ఎవరైనా మరణించినట్లయితే ప్రమాద బీమా ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని మిగిలిన వారంతా వినియోగించుకోవాలని ఆమె ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



లావణ్యకు స్వాగతం పలుకుతున్న గిరిజనులు

తడిసి ముద్దయిన వరి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో తుఫాను ప్రభావం వల్ల గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పంట తడిసి ముద్దయింది. మండలంలోని నడుకూరు, విక్రంపురం, చిటి పూడివలస, చిదిమి, ఎం.రాజపురం, పివిఆర్ పురం, కొట్టు గుమ్మడ, కిమ్మి తదితర గ్రామాల్లో కోసిన పంట తడిసి ముద్దవ్వడంతో వరికుప్పలు కూడా వర్షానికి తడిసి పోయాయి. రెళ్లు రాల్చు పురుగు వరి పంటను ఆశించడంతో పంట కోయక ముందే వెన్నెలు నేలపై రాల డంతో అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో విపత్తులను ఎదుర్కొని పంటలు సాగు చేసినప్పటికీ పంట దిగుబడి ఉన్నప్పటికీ వీటి కారణంగా నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు తెలిపారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.



వీరఘట్టం: తుపాను కారణంగా తడిసి ముద్దయిన వరిచేను

నేలకొరిగిన వరి చేను

గుమ్మలక్ష్మీపురం : తుఫాను ప్రభావంతో గుమ్మలక్ష్మీపురం పరిసర ప్రాం తంలో అక్కడక్కడ వరి చేను నేలకొరిగింది. పంట కోతకు వచ్చే సమయంలో వరిచేను నేలకొరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత మూడు రోజులుగా మబ్బులు కాయడంతో రైతులు వరి కోతలు, నూర్పులు వాయిదా వేశారు.